క్లుప్తంగా

'భీమిలి' ఎన్నికల అధికారులు

తగరపువలస: భీమిలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారుల వివరాలు.

- ఆర్వో : ఎస్.భాస్కరరెడ్డి, భీమిలి ఆర్డీవో : 98499 03854

ఏఈఆర్వోలు :

- టి.గోవింద, తహసీల్దార్, భీమిలి : 94409 94964
- ఎన్.హేమంత్‌కుమార్, తహసీల్దార్, ఆనందపురం : 88822 49999
- ఎస్.వెంకటరావు, తహసీల్దార్, పద్మనాభం : 91000 64935
- డి.శ్రీనివాసరావు(విశాఖ రూరల్, ఏసీపీ భీమిలి జోన్) : 91771 88006.

ఓటు హక్కు దుర్వినియోగం చేయరాదు



పాలవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆనందపురం: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, దాన్ని దుర్వినియోగం చేయరాదని పాలవలస సర్పంచ్ నాగోతు అచ్చియ్యమ్మ చెప్పారు. గుడిలోవలోని ఏక్యూజే కళాశాల విద్యార్థులు బుధవారం సేవా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా అచ్చియ్యమ్మ మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా నిజాయతీగా ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో పవన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



డాక్టర్ కల్యాణ్ శ్రీనివాస్

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి కొత్తగా వచ్చిన ఎనస్థీషియన్ డాక్టర్ కల్యాణ్ శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చింతలపూడి ఏరియా ఆస్పత్రి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన డాక్టర్ ప్రదీప్ సాలూరు ప్రభుత్వ ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇప్పుడు కల్యాణ్ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠ వేడుకలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట అంబేడ్కర్ కాలనీలోని శ్రీసీతారామ, షిర్డీసాయి, ఉమారామలింగేశ్వర ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు బుధవారం నాటి సీతారాముల కల్యాణంతో ఘనంగా ముగిశాయి. అర్చకులు బూరాడ కామేశ్వర శర్మ, దార్లపూడి కైలాసరావు శర్మ ఆధ్వర్యంలో ఈ నెల 17న ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఆలయం వద్ద విగ్రహ యంత్ర ప్రతిష్ఠ, పూర్ణ కలశ శిఖర ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన, సాయంత్రం సీతారాముల కల్యాణం జరిపారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తజనం పాల్గొని పూజలు చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి చక్కని స్పందన

మధురవాడ: బక్కన్నపాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కాలనీలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వార్డు సచివాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో 201 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అవసరం అయిన వారికి ఆరోగ్యశ్రీ కింద మరింత మెరుగైన వైద్యం అందుతుందని నిర్వాహకులు చెప్పారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు సందీప్ (జనరల్ మెడిసిన్), చిన్న పిల్లల వైద్య నిపుణులు అనంత్, కంటి వైద్యులు రత్నం, డెంటల్ వైద్యులు సుభాష్ తదితరులు సేవలందించారు.

అందుబాటులో యునాని వైద్య సేవలు

- గత ప్రభుత్వ హయాంలో మూతపడ్డ వైద్యశాల
- మళ్లీ ఇప్పుడు తెరుచుకున్న వైనం



అందుబాటులో యునాని మందులు



ఆస్పత్రి ఆవరణలో యునాని వైద్యశాల

భీమునిపట్నం: దేశీయ వైద్యంగా ఎంతో గుర్తింపు పొందిన ప్రభుత్వ యునాని వైద్యశాల మళ్లీ తెరుచుకోవడంతో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆయుర్వేదం, హోమియోతో పాటు యునాని వైద్యానికి కూడా మంచి ఆదరణ ఉండేది. ఈ కారణంతో గత 35 సంవత్సరాల క్రితమే భీమిలిలో ఈ వైద్య శాలను ప్రభుత్వం అద్దె భవనంలో ప్రారంభించి వైద్యుడిని నియమించింది. ఇందులో దీర్ఘకాలిక రోగాలకు బాగా పని చేసే లేహ్యాలు, తైలాలు, పొడులు, మందులు ఉండేవి. ఇవి వాడడం వల్ల మంచి ఫలితాలు కనిపించడంతో రోగులు పెద్ద సంఖ్యలో రోజు వచ్చి వైద్యునికి చూపించుకుని మందులు తీసుకెళ్లేవారు. కాగా గత 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వ ఆవరణలోని భవనంలోకి ఈ వైద్యశాలను తరలించారు. గత ప్రభుత్వ హయాంలో దీన్ని సరిగ్గా పట్టించుకోకుండా వదిలేశారు. ఇక్కడికి అవసరమైన మందులు సరఫరా జరగవలసి ఉండగా ఆ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో కొంత కాలానికి ఇది మూతపడిపోయింది. ఈ వైద్యంపై ఆధారపడ్డ వందలాది మంది రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడింది.

మళ్లీ అందుబాటులోకి..

ఈ పరిస్థితుల్లో దీని ఆవశ్యకతను గుర్తించిన ఇప్పటి ప్రభుత్వం ఇక్కడ యునాని వైద్య శాలను మళ్లీ అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఇందులో భాగంగా ఒక వైద్యురాలిని నియమించడంతో పాటు సుమారు 40 రకాల మందులు ఏర్పాటు చేశారు. యునాని ద్వారా దీర్ఘకాలిక సమస్యలైన చర్మవ్యాధులు, కీళ్ల నొప్పులు, వాతం నొప్పులు, ఆస్తమా, సైనసైటిస్, మైగ్రేన్ తలనొప్పి, ఎలర్జీ, ఊపిరితిత్తుల సమస్యలు, గైనిక్ సమస్యలు, కిడ్నీ సమస్యలతో పాటు ఇంకా మరిన్ని రుగ్మతలకు మందులు ఉన్నాయి. దీంతో మళ్లీ రోగులు ఇక్కడ చికిత్సలు తీసుకోవడానికి వస్తున్నారు. సంవత్సరాల తరబడి మూతపడ్డ వైద్యశాల అందుబాటులోకి రావడంపై రోగులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో మందులు



ఇక్కడ ముఖ్యమైన మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన మందుల గురించి ప్రభుత్వానికి సమాచారం ఇచ్చి రప్పించుకుంటాం. ఇప్పటికే సమాచారం అందజేశాం. త్వరలో అవి అందుబాటులోకి రానున్నాయి.

– ప్రతిభ, యునాని వైద్యురాలు

భీమిలి క్రాస్ రోడ్డులో విస్తృత తనిఖీలు

ఆనందపురం: మండలంలోని భీమిలి క్రాస్ రోడ్డులో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నార్త్ సబ్ డివిజన్ పరిధిలోని భీమిలి క్రాస్ రోడ్డు వద్ద పోలీస్ చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. ఇక్కడ మూడు షిఫ్టుల కింద పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ జంక్షన్ గుండా ప్రయాణించే అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తున్నారు. ఇటీవల ఇక్కడ తనిఖీల్లో గంజాయితోపాటు కొంత నగదు పట్టుబడింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున డబ్బు, మద్యం అక్రమంగా తరలిపోకుండా తనిఖీలు చేపడుతున్నారు. రైల్వే ప్రత్యేక రక్షణ దళానికి చెందిన ఐదుగురు కానిస్టేబుళ్లు, ఒక ఏఎస్ఐ, హెచ్‌సీ, ఇద్దరు కానిస్టేబుళ్లు విధుల్లో ఉన్నారు. ఈ సందర్భంగా సీఐ టి.వి.తిరుపతిరావు మాట్లాడుతూ సిబ్బంది పక్కాగా తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇక్కడ 24 గంటలు నిఘా ఉందని, ఎటువంటి అనుమానం వచ్చినా వాహనాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తున్నామని వివరించారు.

మూడో రోజు 19 మంది గైర్హాజరు

ఆనందపురం : మండలంలో ఐదు కేంద్రాల్లో జరుగుతున్న టెన్త్ పరీక్షల్లో బుధవారం 19 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. ఆనందపురం ఎ కేంద్రంలో ముగ్గురు, బి కేంద్రంలో ఐదుగురు, పెద్దిపాలెం నారాయణ స్కూల్ కేంద్రంలో ముగ్గురు, కొంత్యాం కేంద్రంలో ఐదుగురు, బోయిపాలెం కేంద్రంలో ముగ్గురు చొప్పున పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి తెలిపారు.

ఈవీఎంల వినియోగంపై శిక్షణ



మాక్ పోలింగ్‌పై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనీ మహేష్

మధురవాడ : సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల నిర్వహణ, వాటిని భద్రపరచడం ముఖ్యమైన విషయాలని మాస్టర్ ట్రైనీ రెడ్డి మహేష్, నోడల్ అసిస్టెంట్, ఏపీఐఐసీ మేనేజర్ లోహికుమార్ చెప్పారు. విశాఖ తూర్పు నియోజకవర్గం-21 పరిధిలో సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లకు ఎన్నికల నిర్వహణపై మధురవాడ జోనల్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 5 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇక్కడ బుధవారం రెండవ రోజు శిక్షణ ఇచ్చారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలో 25 సెక్టార్లు ఉండగా వీరిలో రోజుకు 5 సెక్టార్లకు చెందిన సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వీరికి మాక్ పోలింగ్, పోలింగ్‌లో తలెత్తే సాంకేతిక, ఇతర అంశాలు, వీటిని తెరవడం దగ్గర నుంచి క్లోజ్ చేసి స్ట్రాంగ్ రూంకి తరలించే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అన్ని విషయాలు కూలంకుషంగా వివరించారు.

వానతో సేదతీరిన జనం



వర్షానికి చిత్తడిగా మారిన రహదారి

పీఎం పాలెం: వేసవిలో ఉపశమనం కలిగించేలా బుధవారం కురిసిన అకాల వర్షానికి జనం సేదతీరారు. రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీలోని అంతర్ రహదారుల్లో వాననీరు నిలిచిపోవడంతో ఆ రోడ్లలో ప్రయాణించే పాదచారులు వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కార్‌షెడ్ కూడలిలో సర్వీస్ రోడ్లపై నీరు ప్రవహించడంతో ప్రజలు అవస్థలు పడవలసి వచ్చింది. గాయత్రీనగర్, ఆర్‌హెచ్‌కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు వర్షం కారణంగా ఇళ్లకే పరిమితం కావలసి వచ్చింది. ఆర్‌టీసీ ప్రయాణికులు, ఈ ప్రాంతంలో వివిధ కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడ్డారు.

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో బుధవారం తేలిక పాటి వర్షం కురవడంతో స్థానికులు సేదదీరారు. మధురవాడ, కొమ్మాది జంక్షన్, కార్‌షెడ్, వుడా కాలనీలలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. ఎండలు చుర్రుమనిపిస్తున్న తరుణంలో కురిసిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



రక్త పరీక్ష చేయించుకుంటున్న విద్యార్థి

ఆనందపురం : మండలంలోని మిందివానిపాలెంలో ఉన్న విశ్వనాథ ఫార్మాస్యూటికల్ సైన్స్ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో మూడో రోజు గిడిజాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో సమన్వయి మాట్లాడుతూ రక్తహీనత వల్ల పలు రుగ్మతలు సంభవిస్తాయని తెలిపారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేసుకుని హిమోగ్లోబిన్ శాతాన్ని తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ బ్లడ్ గ్రూప్‌ని తెలుసుకోవాలని దీనివలన ప్రమాదాల సమయంలో రక్తం కోల్పోతే వెంటనే అదే గ్రూపు రక్తాన్ని అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రాముడి విగ్రహ పునఃప్రతిష్ఠ



సీతారాములకు శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మధురవాడ : మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠంలో గల పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో కొదండ రామస్వామి వారి విగ్రహాల పునర్ ప్రతిష్ఠాపనా కార్యక్రమాలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం, పూర్ణాహుతి, సీతారాముల శాంతి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బంగ్లామెట్ట పాఠశాలలో ప్రత్యేక దినోత్సవాలు

తగరపువలస: భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ సంతోష దినోత్సవం, పిచ్చుకల దినోత్సవం, కప్పల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ సంతోషకరమైన ప్రపంచాన్ని సృష్టించడం కోసం ఐక్యరాజ్య సమితిలోని 193 సభ్యదేశాల ప్రాధాన్యంతో 2012లో సంతోష దినోత్సవం ఏర్పాటు చేశారన్నారు. సమస్యలలో చిక్కుకున్న మనిషికి తాళం సంతోషమన్నారు. జనావాసాల్లో కనిపించే పిచ్చుకకు వాటిల్లుతున్న ముప్పు నుంచి రక్షణ కోసం 2011లో గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో నేచర్ ఫరెవర్ సొసైటీ వీటి దినోత్సవం ప్రారంభించిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు కీలకపాత్ర వహించే కప్ప జాతులకు ఇటీవల ముప్పు పెరిగినందున శాస్త్రవేత్తలు వీటి జాతిని కాపాడేందుకు కప్పల దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు.

గీతం ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్ప తదితరులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు గానూ గీతం బిజినెస్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్-2024ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు గీతం డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్ప తెలిపారు. ఈ నెల 24న దేశ వ్యాప్తంగా 80 పట్టణాల్లో ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, రెండు గంటల కాల వ్యవధి గల ఈ పరీక్ష 200 మార్కులకు ఉంటుందన్నారు. ఎంబీఏలో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్, ఇంటర్నేషనల్ బిజినెస్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఎకౌంటింగ్ స్పెషలైజేషన్‌ను ఆఫర్ చేసినట్లు చెప్పారు. ఎంబీఏ హెల్త్‌కేర్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. విశాఖలో ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్‌తో కలిసి ఈ కోర్సులు రూపొందించి, నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీలో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు అని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ బంగారురాజు, ప్రొఫెసర్ పి.షీలా, జగదీష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సుత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లిని బుధవారం తులసిమాలలు, మల్లెలు, కనకాంబరాలు, బంతిపూల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేషంగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో బాణసంచా వెలిగించారు.

విజయవంతంగా ఆరోగ్య సురక్ష శిబిరాలు

మహారాణిపేట: ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా బుధవారం తోటవీధి (భీమిలి), పెందుర్తి, శ్రామికనగర్, నక్కవానిపాలెం, లంకెలపాలెం, రైల్వే న్యూకాలనీ, శివనగర్, దొండపర్తి, పాత రేసవానిపాలెం(స్వర్ణభారతి), తోటగరువు, బక్కన్నపాలెంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో మొత్తం 2,899 మందికి వైద్య సేవలందించారు. 30 మందిని ఉన్నత వైద్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు, 12 మందిని కంటి చికిత్స కోసం ప్రాంతీయ కంటి ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. గురువారం నగర పరిధిలోని బాలాజీనగర్, ఎంఎస్ఆర్ నగర్, లాసన్స్‌బే కాలనీ, ఇసుకతోట, రైల్వే న్యూకాలనీ, జబ్బరితోట, కంచరపాలెం, సిద్ధేశ్వరం, న్యూ గాజువాక, నరసింహనగర్‌లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

ముగిసిన ఆయుర్వేద మర్మ వైద్య శిబిరం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ బీవీకే కళాశాలలో గో ఆధారిత వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం బుధవారం ముగిసింది. రెండు రోజుల్లో ఈ శిబిరంలో సుమారు 300 మందికి సిద్ధ ఆయుర్వేద వైద్యుడు గురూజీ జైత్రీరామ్, సిబ్బంది వైద్య సేవలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సమష్టి కృషి



మాట్లాడుతున్న పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్

పద్మనాభం: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ పిలుపునిచ్చారు. భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మిలను సమష్టి కృషితో గెలిపించుకోవాలన్నారు. పద్మనాభం జంక్షన్‌లోని పార్టీ కార్యాలయలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మనం ప్రతిపక్షంలో ఉండటంతో ఎటువంటి పథకాలు ఇవ్వకపోయినా భీమిలి ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ తరఫున ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించారన్నారు. ఈ సారి ప్రభుత్వంలో ఉండి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ఇచ్చామని చెప్పారు. గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అనంత పద్మనాభ స్వామి ఘాట్ రోడ్డును రూ.5 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. పాండ్రంగి సమీపాన గోస్తని నదిలో రూ.16.50 కోట్లతో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రెడ్డిపల్లి-పద్మనాభం, రేవిడి-ఐనాడ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేసి అత్యధిక మెజార్టీతో ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బొత్స ఝాన్సీలను గెలిపించాలన్నారు. పద్మనాభం మండలంలోని 22 పంచాయతీల్లో పది రోజులు ప్రచారం నిర్వహించనున్నట్టు మహేష్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, నాయకులు సుంకర బంగారప్పడు, సిరిగుడి ఆదినారాయణ, అముజూరి అప్పారావు, బుగత సత్యనారాయణ, తాలాడ పద్మనాభం, మరగడ అప్పారావు, చందక శ్రీను, చందక పైడినాయుడు, మొకర అప్పలనాయుడు, బొలె అప్పలనాయుడు, కొత్తపల్లి సత్యనారాయణ, సుంకర నారాయణరావు, జి.వి.కె.కె.వర్మ, బేపల గురునాయుడు, బోని సన్యాసినాయుడు, సారిక శంకరరావు, పల్లి మహేష్, మామిడి శివ రామకృష్ణ, మజ్జి శంకర్, నల్లి సన్యాసప్పడు తదితరులు పాల్గొన్నారు.

8వ వార్డులో ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ స్వర్ణ భారతి నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, ముదుండి రాజేశ్వరి, చెన్నాదాసు, చెన్నా ఎల్లయ్య, చిల్లా శ్రీనివాసరెడ్డి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పిచ్చుకలను కాపాడుకోవాలి




పిచ్చుకల ఉనికి కాపాడాలని ప్లకార్డులు పదర్శిస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం: అన్ని ప్రాంతాల్లో పిచ్చుకల సంఖ్య తగ్గిపోతోందని, వాటిని కాపాడుకోవలసిన అవసరం ఎంతో ఉందని ఇక్కడి జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకులు గొట్టేటి రవి అన్నారు. బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. గతంలో పెద్ద ఎత్తున పిచ్చుకలు మన చుట్టు సందడి చేస్తు తిరిగేవని ఇప్పుడు అటువంటి పరిస్థితులు లేవన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, కాలుష్యంతో పాటు మరి కొన్ని కారణాల వల్ల వాటి సంఖ్య బాగా తగ్గిపోయిందన్నారు. గతంలో 35 రకాల జాతులకు చెందిన పిచ్చుకలు ఉండగా ఇప్పుడు చాలా కొద్ది రకాలే ఉన్నాయన్నారు. ఇది ఎంతో బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి వద్ద వాటికి గింజలు వేసి, నీరు అందించాలన్నారు. ఇలా చేస్తే వాటి సంఖ్య మరింత తగ్గిపోకుండా ఉంటుందన్నారు. ఇందులో అధ్యాపకులు త్రినాథరావు, మహాలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

స్ప్లాష్ విజేతగా అక్షిత



అక్షిత



అక్షిత గీసిన చిత్రం

బీచ్ రోడ్డు: దేశ వ్యాప్తంగా యాక్సిస్ బ్యాంకు నిర్వహించిన ఆర్ట్, క్రాఫ్ట్, సాహిత్య పోటీ స్ప్లాష్ విజేతగా నగరానికి చెందిన పి.అక్షిత నిలిచారు. 11 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు గ్రూప్‌లో ఆర్ట్ పోటీలో అక్షిత ప్రతిభకనబరిచింది. ఆమెకు యాక్సిస్ బ్యాంకు రూ.లక్ష స్కాలర్‌షిప్‌ను అందించింది. ఈ పోటీలకు దేశ వ్యాప్తంగా 6.8 లక్షల మంది హాజరయ్యారు. వారిలో అక్షిత విజేతగా నిలవడంపై పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

వ్యవసాయంలో ఏఐ సాంకేతికతపై అవగాహన



అభిరామ్ సరస్వతిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు

ఏయూ క్యాంపస్: వ్యవసాయ రంగంలో ఆర్టిఫీషియల్ సాంకేతికత(ఏఐ) ఉపయోగాలపై అమెరికాలో స్థిరపడిన డాక్టర్ అభిరామ్ సరస్వతి అవగాహన కల్పించారు. బుధవారం ఏయూ జువాలజీ విభాగంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. డేటా సైన్స్ రంగంలో అవకాశాలను వివరించారు. టీకాబ్స్-ఈ నిర్వాహకులు డాక్టర్ వై.రవికిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, జువాలజీ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా అభిరామ్ సరస్వతిని వర్సిటీ తరఫున సత్కరించారు.

హిందీ లోయర్ పరీక్ష ఫలితాలు విడుదల

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ-చెన్నై ఆధ్వర్యంలో గత నెల 10, 11వ తేదీల్లో నిర్వహించిన హిందీ లోయర్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రంగా జరిగిన పరీక్షల్లో 36 మందికి గానూ 25 మంది ప్రథమ శ్రేణిలో, 11 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్టు ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.